




సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ మానుకోట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న దళిత ప్రజాసంఘాలు

కోచ్ తూచ్!



- కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు
- 1982, 2004లో మంజూరైనా.. ఇతర రాష్ట్రాలకు తరలింపు
- చివరకు వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు
- రైల్వే డివిజన్ విషయంలోనూ పేచీలే
- అన్ని అర్హతలున్నా డివిజన్‌కు నోచుకోని కాజీపేట రైల్వే జంక్షన్
- కోచ్ ఫ్యాక్టరీ వస్తే 60వేల మందికి ఉపాధి.. వ్యాగన్‌తో అయితే 2వేల మందికే..
- దక్షిణ మధ్య రైల్వేకు గేట్‌వేగా ఉన్నా అభివృద్ధిపై నిర్లక్ష్యం

'రాష్ట్ర విభజన' హామీని విస్మరించిన కేంద్రం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ ఏర్పాటు కలగానే మారుతున్నాయి. 55ఏళ్లగా కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజలు, ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. 2014లో ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన కోచ్ ఫ్యాక్టరీ హామీపై కూడా కేంద్ర ప్రభుత్వం 'తూచ్' అన్నట్టుగానే వ్యవహరిస్తోంది. కోచ్ ఫ్యాక్టరీకి బదులు 2023లో వ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంది. వేలాది మందికి ఉపాధిని కల్పించే కోచ్ ఫ్యాక్టరీని కాదని, వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేయటంపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో 'వ్యాగన్ వద్దు.. కోచ్ ఫ్యాక్టరే ముద్దు' అంటూ ఓరుగల్లువాసులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పట్టాలెక్కటం లేదు.

కాజీపేట చేజారిన కోచ్ ఫ్యాక్టరీ..

కాజీపేట రైల్వే స్టేషన్ ఉత్తర, దక్షిణ భారత దేశానికి వారిధిగా నిజాం కాలంలోనే నిర్మించారు. కాశీ నుంచి కన్యా కుమారి, చెన్నై నుంచి కోల్‌కత్తా, హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు.. ఎక్కడికి వెళ్లాలనుకున్నా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక ఆదాయం వచ్చే ప్రాంతం కావటంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో 1969లోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు మొదలయ్యాయి. అప్పటి కమ్యూనిస్టు నేతలు బీఆర్ భగవాన్‌దాసు, కాళీదాసు నేతృత్వంలో మొదలైన కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. 1978-80లో అన్ని పార్టీలు తమ జెండాలను పక్కన పెట్టి అఖిల పక్షంగా ఏర్పడి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో హనుమకొండ ఎంపీగా ఉన్న పీవీ.నర్సింహరావు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం చొరవ తీసుకుని అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వద్దకు అఖిల పక్ష నేతలను తీసుకెళ్లారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై అఖిల పక్ష నేతల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్న ఇందిరాగాంధీ 1982లో పార్లమెంట్ వేదికగా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురవడంతో, ఖలిస్థాన్ ఉద్యమాన్ని చల్లార్చడానికి కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తాలకు తరలించారు. ఇక 2004లో యుపీఏ ప్రభుత్వంలో ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మరోసారి కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే కాజీపేటకు మంజూరైన కోచ్‌ఫ్యాక్టరీ రాజకీయ కారణాలతో యూపీలోని రాయబరేలికి తరలిపోవటంతో రెండోసారి కూడా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ దక్కకుండా పోయింది. ఆ తరువాత 2010-11 బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మమత బెనర్జీ ప్రభుత్వ,

మిగతా 8వ పేజీలో..

కోచ్ అడిగితే.. వ్యాగన్ ఇచ్చిన మోదీ..

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన గత కేంద్ర ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించింది. కానీ 2017లో కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ కూడా కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని స్పష్టం చేసి.. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ఇవ్వలేమని చెప్పిందని పరోక్షంగా అంగీకరించిందని అందరూ భావించారు. అయితే 2018 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని లాతూరులో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రూ.625కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా ఉన్న కాజీపేటపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, తెలంగాణ నుంచి ఒత్తిడి పెరగటంతో కేంద్ర ప్రభుత్వం 2023 జూలై 8వ తేదీన కాజీపేటలో 160 ఎకరాల్లో రైల్వేవ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా భూమి పూజ నిర్వహించారు. 2025లోపు పూర్తయ్యేలా రూ.521కోట్లతో ఈ వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. అయితే కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ చేస్తే కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేయటంపై ఓరుగల్లువాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వ్యాగన్‌నే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి

- దేవులపల్లి రాఘవేందర్, రాష్ట్ర రైల్వే ఉద్యోగుల జేఏసీ చైర్మన్



కాజీపేటలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమనే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీగా ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 20ఎకరాల్లో కూడా కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవచ్చు. ఈ కోచ్‌ఫ్యాక్టరీతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. అలాగే దక్షిణమధ్య రైల్వేకు వచ్చే ఆదాయంలో అధిక ఆదాయం కాజీపేట నుంచే వస్తుంది. రైల్వే డివిజన్ ఏర్పాటుకు కాజీపేటకు అన్ని అర్హతలున్నాయి. కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధించే వరకు ఉద్యోగ జేఏసీ పోరాటం చేస్తుంది.

బీజేపీ ఎంపీల అసమర్థత వల్లే..

- నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



విభజన చట్టాలను నెరవేరుస్తారన్న ఆకాంక్షతోనే ప్రజలు బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చారు. కానీ ఆ ఎంపీల అసమర్థత మూలంగానే తెలంగాణలో కీలకమైన కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రావటం లేదు. ఏపీ, బిహార్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కేంద్రం తెలంగాణకు ఇవ్వటం లేదు. కోచ్ ఫ్యాక్టరీతో పాటు రైల్వే డివిజన్ కోసం క్షేత్రస్థాయి నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ పోరాడుతుంది. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కాగానే విభజన చట్టంలోని హామీలను అమలు చేసి తీరుతాం. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీతో పాటు డివిజన్‌ను తీసుకొస్తాం.



నిర్మాణంలో ఉన్న వ్యాగన్ ఫ్యాక్టరీ

మోదీ, మందకృష్ణ మాదిగల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

నెహ్రూసెంటర్, ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ మహబూబాబాద్ జిల్లాలో గురువారం దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని 18 మండలాలు, వివిధ గ్రామాల్లో విజయోత్సవ వేడుకలను పురస్కరించుకుని ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్-టీఎస్ దండోరా జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సురుగు ఐలయ్య మాట్లాడారు. మందకృష్ణ మాదిగ, ఇతర దళిత ప్రజాసంఘాల 30 సంవత్సరాల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీను, గాడిపెల్లి వెంకన్న, సీహెచ్.రాధ, కుక్కల సుధా, వీరభద్రం, యాకయ్య, గంధం శ్రీరాములు, శ్రీనివాసచారి, శంతన్, శంకర్‌నాయక్, నాగాచారి, శోభ, నర్సమ్మ, రాజమ్మ, రాజేశ్వరి, ఉప్పలమ్మ, కళమ్మ, రత్తమ్మ, రామారావు, శ్రీను, రాంమ్మూర్తి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై తీర్పు హర్షణీయం

- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



మహబూబాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ డిప్యూటీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నా రు. హైదరాబాద్ నుంచి గురువారం మహబూబాబాద్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో రాజకీయ పార్టీలు ఓట్ల కోసం నాటకాలు ఆడాయని, ఆ అంశాన్ని రాజకీయం చేస్తూ మాదిగలను మోసం చేశాయని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సామాజిక న్యాయం లో భాగంగా ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మాణం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎం హోదాలో ఉన్నప్పుడు ప్రధాని మోదీని కలిసి వర్గీకరణకు లేఖ ఇచ్చారని చెప్పారు. అత్యున్నత న్యాయస్థానం కూడా వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షనీయమన్నారు.

మునిసిపల్ చైర్మన్‌పై ఇచ్చిన అవిశ్వాస నోటీస్ ఉపసంహారణ

మరిపెడ, ఆగస్టు 1 : మరిపెడ మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోరుతూ స్థానిక 10 మంది వార్డు కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఫాం-1 ద్వారా ఇచ్చిన నోటీస్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు 13 మంది వార్డు సభ్యులు సంతకం చేసి, మరో నోటీస్ గురువారం అందచేశారు. కొందరు తమను బలవంతం చేసి, సంతకం పెట్టించుకున్నారని ఆ నోటీస్‌లో వారు ఆరోపించారు. ఉపసంహరణ నోటీస్‌పై 1వ వార్డు కౌన్సిలర్ గుగులోత్ సింధూరకుమారి, 2వ వార్డు బానోత్ శ్రీను, 3వ వార్డు రేఖ లలిత, 4వ వార్డు సభ్యురాలు మృతి చెందగా, 5వ వార్డు సుజాత, 6వ వార్డు పద్మ, 7వ వార్డు పూరుకొండ శ్రీను, 8వవార్డు కిషన్, 10వ వార్డు హథిరామ్, 11వ వార్డు పరుశ రాములు, 12వ వార్డు బయ్య భిక్షం, 14వ వార్డు ఉపేంద్ర, 15వ వార్డు కౌన్సిలర్ కౌసల్య సంతకాలు పెట్టారు.

షెడ్యూల్డ్ తెగల సమస్యలపై దృష్టి పెట్టాలి

- సంక్షేమ పథకాలు అందేలా చూడాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్డ్ తెగల సమస్యలపై అధికారులు దృష్టి సారించి, సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్ తెగల హక్కుల పరిరక్షణ కోసం అధికారులు కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని, గిరిజనులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఏ చిన్న సమస్యను కూడా నిర్లక్ష్యం చేయవద్దని, ఈ కమిషన్‌కు ఏదైనా కేసు విచారించే విషయంలో సివిల్‌కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులపై ఎక్సైజ్ శాఖ కఠినంగా వ్యవహరించాలని, మెడికల్ కళాశాల నిర్మాణంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితుల సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు, అధికారులు నర్మద, కళావతిబాయి, నర్సింహామూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదవాలి

కురవి : ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలోని విద్యార్థులు బాగా చదువాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ సూచించారు. సమస్యలులేని విద్యానిలయాలుగా వాటిని తీర్చిదిద్దుతామని, కేంద్రప్రభుత్వం ఇందుకు కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. కురవిలోని ఏకలవ్య మోడల్‌స్కూల్లో గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై రెసిడెన్షియల్‌లో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తన దృష్టికి తీసుకు వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎస్టీ కమిషన్ డైరెక్టర్ మిరాండీ, ఆర్డీవో అలివేలు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ జ్యోతి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో వీరబాబు, డీడీ ఎర్రయ్య పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జాటోతు హుస్సేన్‌నాయక్

పోలీస్ అధికారులతో సమావేశం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా పోలీస్ అధికారులతో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న గిరిజనులు ఎదుర్కొంటున్నసమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్, ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతి రావు పాల్గొన్నారు.

హుస్సేన్‌నాయక్‌కు సన్మానం

మరిపెడ : జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్‌నాయక్‌ను మరిపెడ బంగ్లాలోని స్థానిక కార్గిల్ సెంటర్ దగ్గర బీజేపీ నేతలు సన్మానించారు. ఆయన హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు వెళ్లుతుండగా, పట్టణ బీజేపీ శ్రేణులు స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో చీకటి మహేశ్, భూక్యా కాంతమ్మ, గంగాదర్, భూక్యా శ్రీను తదితరులు ఉన్నారు.

దాతృత్వం చాటుకున్న మానుకోట పోలీసులు

రోడ్లపై ఏర్పడిన గుంతల్లో కంకర పోసి పూడ్చివేత



మానుకోటలో రోడ్డుపై పడినగుంతలో కంకర పోయిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 : ఇటీవల కురుస్తున్న వర్షాలతో మహబూబాబాద్ పట్టణంలోని రోడ్లపై పడ్డ గుంతల్లో కంకర పోయించి పోలీసులు దాతృత్వాన్ని చాటుకున్నారు. జిల్లా ఎస్పీ రామ్‌నాథ్‌కేకన్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది రోడ్లపై గుంతల్లో కంకర, మొరం పోయించి వాహనదారులు, ప్రజల కష్టాలు తీరుస్తున్నారు. అందులో భాగంగా మానుకోట పట్టణంలోని మూడుకొట్ల జంక్షన్, ఎఫ్ఆర్వో సెంటర్, జగన్‌కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో గురువారం టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో రోడ్లపై పడ్డ గుంతల్లో కంకరపోసి వాటిని పూడ్చారు.

బైక్ దొంగకు రిమాండ్

తొర్రూరు, జూలై 1 : ఇంటి ముందు నిలిపిన బైక్‌ను దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జగదీష్ గురువారం తెలిపారు. మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన బట్టమేకల కృష్ణ 20సంవత్సరాలుగా తొర్రూరు పట్టణంలోని బీరప్ప నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గత నెల 15వ తేదీన తన ఇంటి ముందు నిలిపిన స్ప్లెండర్ ప్లస్ వాహనాన్ని కొడకండ్ల మండలం రేగులకు చెందిన పి.సాయికృష్ణ దొంగిలించడంతో విచారణ చేపట్టిన పోలీసులు అతని వద్ద నుంచి బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

సీఎం తక్షణమే క్షమాపణ చెప్పాలి

- ఆడబిడ్డలను ఏడిపిస్తే తెలంగాణ సమాజం ఊరుకోదు
- మాజీ ఎంపీ మాలోతు కవిత



మహబూబాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డిలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిండు శాసనసభలో మహిళా ఎమ్మెల్యేలను అవహేలన చేస్తూ సీఎం మాట్లాడడం సరికాదన్నారు. ఆడబిడ్డలంటే అంత అలుసా అని ప్రశ్నించారు. ఆడబిడ్డలను ఏడిపిస్తే ఆ ఉసురు ఊరికేపోదని, తెలంగాణ సమాజం ఊరుకోదన్నారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునితాలక్ష్మారెడ్డిలకు క్షమాపణ చెప్పకపోతే మహిళా లోకం క్షమించదన్నారు. మహిళా ఎమ్మెల్యేల ఆత్మగౌరం గూర్చి బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తే వారిని అక్రమంగా అరెస్టు చేశారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ఉంటుందని, అన్యాయాలపై ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా? అంటూ నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాపాలను ప్రజలు లెక్కకడుతున్నారని, తగిన సమయంతో వారికి గుణపాఠం చెబుతారన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



తల్లిపాల వారోత్సవాల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రతీ ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి 7 తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది తల్లి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, ప్రత్యేకంగా చిన్నపిల్లల ఆరోగ్య సమస్యలపై వైద్యాధికారులు దృష్టి సారించి, ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బరువు తక్కువగా ఉన్నపిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా వైద్యాధికారి కళావతిబాయి మాట్లాడుతూ తల్లి పాలతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని, బిడ్డపుట్టిన గంటలోపు ముర్రు పాలు తాగించాలన్నారు. తల్లిపాలను మించిన ఔషధం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి వరలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, కౌన్సిలర్ మార్నేని శ్రీదేవి, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, మార్నేని కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లి, మెగ్యాతండా, చిన్నగూడూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ కవిత, డాక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు జ్యోతి, పద్మ, లలిత, కళమ్మ పాల్గొన్నారు.

- మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని పూలబజారులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, టీచర్లు రేణుక, శారద పాల్గొన్నారు. వీరారం అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో శిరీష, సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు శ్రీవాణి పాల్గొన్నారు.
- నెల్లికుదురు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలునిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు మద్ది విజయ, పద్మ, ఎం.పద్మ, పి.జ్యోతి, ఎం.మాధవి, కె.పద్మ పాల్గొన్నారు.
- సీరోలు మండలంలోని కాంపెల్లి సర్కిల్‌లోని తాళ్లసంకీస, బీల్యాతండాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లమ్మ, సూపర్‌వైజర్ రమణ, టీచర్లు వనజ, మంగతాయి, గ్రామకార్యదర్శి ఠాగూర్, హెచ్ఎం రాజేందర్, సంధ్యారాణి, ఉమాదేవి, మల్లిక, ఆరోగ్య లక్ష్మి కమిటీ సభ్యులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, ఆగస్టు 1 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలను వివిధ పోలీస్ స్టేషన్‌లకు బదిలీ చేస్తూ గురువారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన సీఐలు

ఎ.శ్రీనివాస్‌రెడ్డి వీఆర్ నుంచి రఘునాథ్‌పల్లి, ఇ.శ్రీనివాస్ రఘునాథ్‌పల్లి నుంచి కమిషనరేట్, ఎ.ప్రవీణ్‌కుమార్ ఎల్కతుర్తి నుంచి ధర్మసాగర్, ఎ.మహేందర్ ధర్మసాగర్ నుంచి సీసీఎస్ వరంగల్, జి.వేణు మల్టీజోన్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్.

ఎస్ఐలు వీరే..

బండి శ్రావణ్‌కుమార్ కొడకండ్ల నుంచి లింగాలఘనపూర్, సీహెచ్.రాజు లింగాలఘనపూర్ నుంచి ఇంతెజార్‌గంజ్, బానోత్ రాంచరణ్ కేయూసీ నుంచి జాఫర్‌గఢ్, ఎ.సురేష్ వీఆర్ నుంచి వేలేర్, డి.హరిత వేలేర్ నుంచి సుబేదారి, ఎస్.నవీన్‌కుమార్ వీఆర్ నుంచి చిల్పూర్, ఎం.రాజేందర్ చిల్పూర్ నుంచి కేయూసీకి బదిలీ అయ్యారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 1 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని జేఎన్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

డెంగీకి నిండు గర్భిణి బలి

గర్భస్థ కవల శిశువులు సహా కన్నుమూత

శాయంపేట, ఆగస్టు 1: మరో వారం పది రోజుల్లో పురుడు పోసుకుని పండంటి ఇద్దరు కవల ఆడపిల్లలకు జన్మనివ్వాల్సిన ఆ తల్లిని డెంగీ జ్వరం బలితీసుకుంది. గర్భంలో ఉన్న పిల్లలు సహా తల్లి మృతి చెందిన విషాదకరమైన ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి శ్రీకాంత్ ప్రింటర్స్ సర్వీస్ చేస్తూ జీవిస్తున్నాడు. రెండేళ్ల క్రితం పరకాల మండలం మల్లక్కపేట గ్రామానికి చెందిన దొమ్మాటి లక్ష్మి-భిక్షపతి దంపతుల మొదటి కుమార్తె అయిన ప్రియాంకతో శ్రీకాంత్ వివాహం జరిగింది. కొద్దికాలంలోనే ప్రియాంక అనారోగ్యంతో మృతి చెందింది. అనంతరం భిక్షపతి కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. భిక్షపతి రెండో కూతురు అయిన శిరీష(29)ను కుటుంబసభ్యులు శ్రీకాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ నేపథ్యంలో నిండు గర్భిణి అయిన శిరీష మూడు రోజుల క్రితం డెంగీ జ్వరం బారిన పడగా ఆమెను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. రక్తకణాలు పూర్తిగా పడిపోవడం, గురువారం ఆమె పరిస్థితి తీవ్ర విషమంగా మారడంతో కనీసం గర్భంలో ఉన్న కవల శిశువులనైనా బతికించాలని డాక్టర్లు ప్రయత్నం చేశారు. కానీ వారి ప్రయత్నం ఫలించలేదు. గర్భస్థ శిశువులు సహా శిరీష మృతి చెందింది. కుటుంబంలో వరుస విషాద సంఘటనలు జరగడంతో వారి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగారు.

బీసీల అభివృద్ధికి రూ. 20 వేల కోట్ల కేటాయించాలి

కాజీపేట, ఆగస్టు 1: బీసీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ కోల జనార్దన్ డిమాండ్ చేశారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 4న హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో బీసీ సంఘాల నాయకులు సాదినేని సుధాకర్, మాచర్ల శరత్ కుమార్, గొల్లపల్లి వీరస్వామి, తాడిశెట్టి క్రాంతికుమార్, దువ్వ కనుకరాజ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కాజీపేట, ఆగస్టు 1 : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు..కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట ప్రశాంత్‌నగర్ కు చెందిన ఎస్‌డీ అలీ (40), ఈ నెల 25న బైక్‌పై నిట్ నుంచి తన ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఎస్‌డీ అలీకి తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.





















ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్థభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి..

ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అశ్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)





వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

రేపు ఎస్సార్ యూనివర్సిటీలో ద్వితీయ స్నాతకోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సార్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 1: హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో శనివారం ద్వితీయ స్నాతకోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిస్తున్నామని ఎస్సార్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనారెడ్డి తెలిపారు. గురువారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి సయంట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్. మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. గత 45 ఏళ్లుగా విద్యారంగంలో ఎస్సార్ విద్యాసంస్థలు ముందున్నాయని, 2022లో ప్రైవేటు యూనివర్సిటీగా ఎస్సార్ ఆమోదించబడిందని గుర్తు చేశారు. 2002లో ప్రాంభంమైన ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ నాక్, ఎన్‌బీఏ, డబ్ల్యుజీసీ అక్రిడిటేషన్లు సాధించిందన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో 2023లో 98వ స్థానం సాధించిందన్నారు. నూతన ఆవిష్కరణలతో అటల్ ర్యాంకింగ్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో డిగ్రీల ప్రదానంతో పాటు గౌరవ డాక్టరేట్లు, పూర్వ విద్యార్థులకు సత్కారం, కాంక్లేవ్, టాసింగ్ ఆఫ్ క్యాప్స్, అధికారిక ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేష్, డాక్టర్ రామ్‌దేశ్‌ముఖ్, డాక్టర్ సుమన్‌కుమార్, డీన్లు, హెడ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ పోరాటం ఫలించిన వేళ

» ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు

» వర్గీకరణ పోరాటానికి, నాయకత్వానికి వేదికైన ఓరుగల్లు



హనుమకొండ సిటీ, ఆగస్టు 1: మూడు దశాబ్దాల మాదిగల ఆత్మగౌరవ రక్షణ పోరాటం ఫలించింది. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పు చెప్పడంతో మాదిగ జాతి ఆనందడోలికల్లో మునిగితేలుతోంది. వర్గీకరణే లక్ష్యంగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలకు ఓరుగల్లు నుంచే అంకుర్పారణ జరిగింది. ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ కమిటీ నిర్మాణం జరిగినా.. అంతకు ముందు నుంచే ఓరుగల్లులో ఎంఆర్‌పీఎస్ స్థాపనపై ఆలోచనలు, సమావేశాలు, చర్చలు జరిగాయి. ఈ మహోత్తర పోరాటానికి వ్యవస్థ నిర్మాణమే కాదు నాయకత్వం వహించిన నాయకుడు మందకృష్ణ మాదిగ ఓరుగల్లు వాసే. పోరుగల్లు పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఆయన లక్ష్య సాధన వైపు అడుగులు వేయగా.. ఆయన వెంట మాదిగ జాతి యావత్తు నడిచింది. పోరాట క్రమంలో అభిప్రాయభేదాలు వచ్చినా.. అప్పటి వరకు ఒక్కటిగా ఉన్న మాదిగ సంఘాలు వేరయినా.. అందరి లక్ష్యం 'వర్గీకరణే' అన్నట్టుగా పోరు సాగింది. చివరకు గురువారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో దేశ చరిత్రలో ఓ మహాఘట్టం ఆవిష్కృత మైంది. విద్య, ఉద్యోగాల్లో మాదిగ జాతి అభ్యర్థులకు సముచిత న్యాయం దక్కే అవకాశం వచ్చింది.

పోరాటంలో ఓరుగల్లుదే కీలక పాత్ర

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మూడు దశాబ్దాల పాటు సాగిన పోరాటంలో ఓరు గల్లు కీలకపాత్ర పోషించింది. హనుమకొండ హంటర్‌రోడ్డు న్యూశాయంపేటకు చెందిన మందకృష్ణ మాదిగ అడుగు ముందుకేశారు. 1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో 20మంది యువకులతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని ఏర్పాటు చేసిన అదే రోజున గ్రామ కమిటీని నియమించారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఒంగోలు, హైదరబాద్‌లో జరిగిన భారీ బహిరంగ సభలు వర్గీకరణ పోరాటానికి బలమైన పునాదులు వేశాయి. అనంతరం 1998లో జస్టిస్ రాంచంద్రరాజు కమిషన్ ఏర్పటవగా.. వర్గీకరణకు ఆ కమిషన్ సిఫార్సు చేసింది. నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్ర బాబు వర్గీకరణకు ఓకే చెప్పడంతో 2004 వరకు 22వేల ఉద్యోగాలు మాదిగ సామాజిక అభ్యర్థులకు లభించాయి. కానీ పార్లమెం ట్‌లో బిల్లు ప్రవేశపెట్టకుండా వర్గీకరణ అమలు చేయడమేంటన్న వివాదాలు తలెత్తడంతో వర్గీకరణకు ఆటంకంఏర్పడింది. దీనిపై మళ్లీ ఉద్యమం రగిలింది. వైయస్ ప్రభుత్వ హయంలో 2004లోనే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఛలో అసెంబ్లీ పోరాటం చేయడంతో నాటి వైయస్ ప్రభుత్వం వర్గీకరణపై తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.

2006లో నాటి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఉషామెహ కమిషన్ వేయగా 2008లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన కమిషన్ బృందం వర్గీకరణతోనే సామాజిక న్యాయం జరుగుతుందని నివేదిక ఇచ్చింది. ఆ తరువాత తెలంగాణ మలి దశ ఉద్యమం ఆరంభం కావడంతో వర్గీకరణ బిల్లు తెరమరుగైంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత మళ్లీ వర్గీకరణ పోరాటం ఊపందుకుంది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు వర్గీకరణ అమలు తీర్పును ఇవ్వడంతో మూడు దశాబ్దాల పోరా టానికి విజయంతో ముగింపు వచ్చింది.

జిల్లాలో జరిగిన ముఖ్య ఘట్టాలు..

2006లో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగం గా కాజీపేటలో అర్ధరాత్రి పుష్‌పుల్ రైలుకు నిప్పంటించారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమ తీవ్రతను చాటింది. ఇక అదే ఏడాది హైదరాబా ద్‌లో మందకృష్ణ చేపట్టిన ఆమరణ దీక్షలో వరంగల్ జిల్లా నుంచే అత్యధికంగా మేధావులు, యువకులు పాల్గొన్నారు.



5 నుంచి 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

మహబూబాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణ, గ్రీనరీ పెంపు లక్ష్యాలుగా.. ఈనెల 5వ తేదీ నుంచి 9 వరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా రాష్ట్రప్రభుత్వప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి గురువారం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమ నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్యం నిర్వహణ, గ్రీనరీని పెంచడమే లక్ష్యంగా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో 'స్వచ్ఛదనం-పచ్చదనం' నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆగస్టు



వీసీలో పాల్గొన్న అద్వైత్‌కుమార్‌సింగ్

5న అన్ని గ్రామాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించాలని, 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7న మురికి కాలువలు, నీటినిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధికుక్కల దాడుల నివారణ చర్యలు, 9న చివరిరోజు డ్రైడే, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయడం లాంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రతీ నెలలో మూడో శనివారం 'స్వచ్ఛదనం-పచ్చదనం' దినంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వీసీలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, జిల్లా అధికారులు నర్మద, కళావతిబాయి, శాంతికుమారి, సైదు, హరిప్రసాద్, అభిమన్యుడు, మరియన్న, కిరణ్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలి'



ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ వెంకన్న

● ఎమ్మెల్యే మురళీనాయక్‌కు మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 : మానుకోట మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌కు గురువారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అసెంబ్లీలో ప్రస్తావించి అధిక నిధులు కేటాయించేలా కృషి చేయాలని కోరారు.

పట్టణాభివృద్ధికి తోడ్పాటునందించాలి..

మనుకోట పట్టణాభివృద్ధికి తోడ్పాటునందించాలని మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుతో కలిసి సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతిపత్రాన్ని అందించారు. వార్డు కౌన్సిలర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

తమ్ముడి చేతుల మీదుగా అన్న ఉద్యోగవిరమణ



కొత్తగూడలో తేజ్యానాయక్‌ను సన్మానిస్తున్న భీమానాయక్

కొత్తగూడ, ఆగస్టు 1 : అన్న పదవీవిరమణ వేడుకకు తమ్ముడు ముఖ్యఅతిథి. తమ్ముడి చేతుల మీదుగా అన్న పదవీవిరమణ పొందిన అరుదైన ఘటన కొత్తగూడలో గురువారం చోటు చేసుకుంది. కొత్తగూడ అటవీశాఖ రేంజ్‌లో బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దారవత్ తేజ్యానాయక్, అటవీశాఖ భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ భీమానాయక్ స్వయాన అన్నదమ్ములు. తేజ్యానాయక్ పదవీ విరమణ వేడుకను కొత్తగూడలో నిర్వహించారు. ఈవేడుకకు ముఖ్యఅతిథిగా సీసీఎఫ్ భీమానాయక్ హాజరయ్యారు. తేజ్యానాయక్‌ను భీమానాయక్, డీఎఫ్‌వో విశాల్, ఎఫ్ఆర్వో వజాహత్ సన్మానించారు. సీసీఎఫ్ భీమానాయక్ మాట్లాడుతూ నాచేతుల మీదుగా మా అన్న పదవీవిరమణ పొందటం అనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తేజ్యానాయక్ కుటుంబసభ్యులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'గిరిజన రైతుల భూములకు రక్షణ కల్పించాలి'

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 : తాతముత్తాతల నుంచి వారసత్వంగా వస్తున్న గిరిజన రైతుల భూములను అభివృద్ధి పేరుతో లాక్కుంటున్నారని, తమ భూములకు రక్షణకల్పించి, న్యాయం చేయాలని గిరిజన రైతులు బి.హర్యా, బానోత్ నర్సింగ్, అంగోతు హనుమా, బానోత్ బద్యాబానోత్ లక్ష్మి కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో గురువారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంశివారులోని బీసీ కాలనీ దగ్గర సర్వేనెంబరు 551/43, 551/40, 551/38లలో తమ ఐదు కుటుంబాలకు చెందిన నాలుగు ఎకరాల 20 గుంటల అసైన్డ్ పట్టా భూమిలో తాతముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్నామని చెప్పారు. ఆ భూమిపై ప్రస్తుతం 12 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా డిసెంబరు 2023లో ఆ భూమిని హోంగార్డుల నివాసాల కోసం కేటాయిస్తునామని రెవెన్యూ అధికారులు చెప్పడంతో ఆందోళన చెందుతున్నామని తమకు ఈ భూమి తప్ప వేరే దిక్కు లేదన్నారు. భూమిని కాపాడి న్యాయం చేయాలని రైతులు కోరారు.



హుస్సేన్‌నాయక్‌కు గోడును చెప్పుకుంటున్న రైతులు

● హోంగార్డులకు కేటాయించిన స్థలాలను అలాట్‌మెంట్ చేసి పట్టాలందించాలని జాటోత్ హుస్సేన్‌నాయక్‌కు హోంగార్డులు వినతిపత్రాన్ని అందించారు. హోంగార్డులు జన్ను జంపయ్య, పి. రాంప్రసాద్, ఎల్లాగౌడ్, సంజీవ, మహమూద్‌పాషా, సత్యం, మధు, నాగేశ్వర్‌రావు, తిరుపతి, శంకరయ్య, వీరమల్లు, దేవేందర్, కుమార్, సతీష్ పాల్గొన్నారు.

● గిరిజన రైతుల భూముల సమస్యలను పరిష్కరించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జాటోతు హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీఎం, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 : తెలంగాణ సాంస్కృతిక సారథుల వేతనం 30 శాతాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ మానుకోటలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి కృష్ణారావు ఫ్లెక్సీకి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జేఏసీ పూర్వ చైర్మన్ జోలి సత్యనారాయణ, తెలంగాణ సాంస్కృతిక సారథి, కవి, గాయకుడు గిద్దె రాంనర్సయ్య మాట్లాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథులు కంబాలపల్లి సత్యనారాయణ, ఐలేష్, మెరుగు రవీందర్, బండ వెంకన్న, కొమిరె వెంకన్న, జిన్నా, ప్రవీణ్, సురేష్, కవిత, అశ్విని, రాజమౌళి, అనిల్, రాజ్యలక్ష్మి, యాది, యుగేందర్ పాల్గొన్నారు.



సీఎం, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథులు

విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం ఎన్నిక

కేసముద్రం, ఆగస్టు 1 : కేసముద్రం వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో గురువారం విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు దూదికట్ల ప్రకాశాచార్యులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా ఆరెందుల ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శిగా గద్దోజు యశ్వంత్‌చార్యులు, కోశాధికారి వరంగంటి రాఘవేంద్రాచారి, ఉపాధ్యక్షునిగా బొమ్మనపల్లి రఘునాధాచార్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గుండోజు వాసుదేవాచార్యులు, కుమారస్వామి, అశోక్, వాసుదేవాచార్యులు, బెజ్జం శరత్ పాల్గొన్నారు.

'9న ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలి'

గూడూరు, ఆగస్టు 1 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతీగూడెంలో ఈనెల 9న నిర్వహించుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ పిలుపునిచ్చారు. గూడూరులో గురువారం తుడుందెబ్బ నాయకుల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ. ఆదివాసీల హక్కుల చట్టాల అమలు కోసం పోరాటాలు చేసిన అమరులను స్మరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడిగె నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ రేగ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పూనెం యాకయ్య, ఎర్రయ్య, వజ్జయ్య, మంగయ్య, సునిల్, పొట్టయ్య, బుచ్చిరాములు పాల్గొన్నారు.

న్యాయ పోరాటానికి మాలలు సిద్ధం కావాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 : వర్గీకరణ తీర్పుతో ఆర్టికల్ -14 సమానత్వానికి భంగం కలుగుతుందని మాలలంతా న్యాయపోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ మాలమహానాడు (టీఎంఎం) రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఈనెల 7,8,9 తేదీల్లో నిర్వహించతలపెట్టిన సామాజిక చైతన్య దీక్షల కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. సంఘం నాయకులు అశోధభాస్కర్, దారా కుమార్, జయపాల్, రమేష్, మహేష్, భరత్, ప్రేమ్‌కుమార్,వెంకటాద్రి, తిరుపతి, యాకయ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

గీతన్నల చైతన్యయాత్రను సక్సెస్ చేయండి

● కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 : అమరుల యాదిలో ఈనెల 2 నుంచి 18 వరకు జరిగే గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో గురువారం సంఘం ఆధ్వర్యంలో గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఆగస్టు 2న బొల్లగాని పుల్లయ్య వర్ధంతిని గీతన్నల చైతన్య ప్రారంభమై ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వరకు అమరుల యాదిలో యాత్ర ముగుస్తోందన్నారు. వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, మోహన్, వీరస్వామి, యాకన్న, విక్రమ్,సైదులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 1 : జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం సాయంత్ర ఏకకాలంలో పోలీసులు వాహనాలు తనీఖీలు చేశారు. ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాలతో పోలీస్ అధికారులు, సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా తనీఖీలు చేశారు. కొత్తగా వ్యక్తులు కన్పిస్తే వివరాలు అడిగి తెలుసుకుని పంపించారు. వాహనాల తనీఖీలతో నిషేధిత గంజాయి, గుట్కా, అక్రమ రవాణకు చెక్ పెట్టవచ్చని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు.

కోచ్ తూచ్!

(5వ పేజీ తరువాయి)

ప్రైవేట్ భాగస్వామ్యంతో కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.15కోట్లు మంజూరు చేశారు. దీనికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 54ఎకరాల భూమిని కూడా కేటాయించినా.. ఆ భూమిపై వివాదాలు రావటంతో ఆ ప్రాజెక్టు వెనక్కు వెళ్లింది. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం హామీ ఇచ్చినా అది నెరవేరలేదు.

వ్యాగన్‌తో ఒనగూరేది అంతంతే..

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమతో ఒనగూరేది ఏమిటనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. తాము డిమాండ్ చేస్తున్న కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు పెట్టి.. కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారని విమర్శిస్తున్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే సుమారు 60వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని, వ్యాగన్ ద్వారా కేవలం 2వేల మందికి కూడా ఉపాధి లభించే అవకాశాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసినా కోచ్‌ఫ్యాక్టరీ కూడా కాజీపేటలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇటీవల కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల్లో తెలంగాణకు ఇచ్చిన విభజన హామీల్లోని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని కోరారు. అయితే ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ వస్తే మరి కొన్ని రైల్వే సంబంధిత భారీ పరిశ్రమలు కూడా వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

కలగానే రైల్వే డివిజన్..

దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి బలంగా వచ్చింది. కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా నిత్యం సుమారు 200లకు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ ఆదాయం వచ్చే జంక్షన్లలో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. ఇక కాజీపేటకు అతి సమీపంలో సికింద్రాబాద్ డివిజన్ ఉండటం మూలంగానే కాజీపేటకు డివిజన్ ఇవ్వటం కుదరటం లేదని కేంద్ర చెప్తుతుందని, అయితే విజయవాడకు కేవలం 30కిలో మీటర్ల దూరంలోనే ఉన్న గుంటూరును డివిజన్ చేసినప్పుడు హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్ చేయటంలో అభ్యంతరం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రైల్వే డివిజన్ ఏర్పడితే పరిపాల సౌలభ్యంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని రైల్వే ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.

గూడూరులో తీజ్ ఉత్సవాలు ప్రారంభం

గూడూరు, ఆగస్టు 1 : గూడూరులో తీజ్ ఉత్సవాలను గిరిజనులు గురువారం ప్రారంభించినట్లు తీజ్ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మానాయక్, భూక్య బాలునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా తీజ్ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు పెళ్లికాని గిరిజన యువతులు బుట్టలు తీసుకువచ్చి అందులో గోధుమ గింజలను (నారు) పోసి నీరు పోశారు. లంబాడ గిరిజనులు ఐక్యతకు చాటిచెప్పి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఉత్సవ కమిటీ సలహాదారులు నూనావత్ రమేష్‌నాయక్, మోతీలాల్‌నాయక్, కటార్‌సింగ్, గౌరవ అధ్యక్షుడు భరత్‌నాయక్, శ్రీశ్రీ వాల్యానంద కన్నె గురుస్వామి, ఉపాధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్, కోశాధికారి వాంకుడోతు గోపీనాథ్‌నాయక్, కార్యదర్శి స్వామి, అజ్మీర సురేష్‌నాయక్, నూనావత్ రవి, వెంకన్న, శరత్, శ్రీనివాస్, పాల్గొన్నారు.



బుట్టల్లో గోధుమ గింజలను పోస్తున్న గిరిజనులు

డీఈవో కలిసిన డీసీఈబీ నూతన కమిటీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 1 : జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ (డీసీఈబీ) బాధ్యులుగా నియామకమైన కమిటీ బాధ్యులు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి రామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. డీఈవోను కలిసిన వారిలో డీసీఈబీ సెక్రటరీ వాంకుడోతు బాలాజీనాయక్, అసిస్టెంట్ సెక్రటరీ సతీష్, గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లచ్చిరాంనాయక్, నాయకులు వెంకటేశ్వర్లు, ఎం. శ్రీరాములు, శంకర్, రాజు, కార్యాలయ సూపరిండెంట్ ఉమామహేశ్వర్‌రావు, డీఎస్వో అప్పారావు, క్వాలిటీ కోఆర్డినేటర్ ఆజాద్ చంద్రశేఖర్ ఉన్నారు.

మూగ యువకుడి అదృశ్యం



లక్ష్మణ్

నెల్లికుదురు, ఆగస్టు 1 : నర్సింహులగూడెంలోని క్రషర్‌మిల్లులో పని చేస్తున్న 18 ఏళ్ల మూగయువకుడు బుధవారం అదృశ్యం అయ్యాడు. ఎస్సై సీహెచ్ రమేష్‌బాబు కథనం ప్రకారం. బీహార్ రాష్ట్రం, రేవల్‌గంజ్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ పుట్టుకతోనే చెవిటి మూగఅంగవైకల్యంతో జీవిస్తున్నాడు. తన బంధువులతో వావిలాలో నివాసం ఉంటూ నర్సింహుగూడెంలోని క్రషర్‌మిల్లులో కూలిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎవరికి చెప్పకుండా క్రషర్‌మిల్లు నుంచి వెళ్లిపోయాడు. బంధువులకు సమాచారం అందించిన ఆచూకి తెలియక పోవడంతో తన బంధువు శివశంకర్ గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. యువకుడి ఆచూకి తెలిసినవారు పోన్‌నెంబర్ 8712656985, 8712656986 సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

● 'తాడు' జిల్లా అధ్యక్షుడు నలమాల సాయి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 : ఆటో కార్మికుల సంక్షేమ కోసం రాష్ట్రప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ (తాడు) జిల్లా అధ్యక్షుడు నలమాన సాయి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆటోకార్మికులదినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్‌లో తాడుఆధ్వర్యంలో గురువారం కేక్‌కట్ చేశారు. జినుక సైదులు, జానీ, దుంపల శ్రీను, నిరంజన్, చెక్కుల అశోక్, వీరస్వామి, రమేష్, ప్రశాంత్, లోకేష్, శేఖర్, నరేష్, రాందాస్, వీరన్న, రాజు, నరేందర్, గాడిపెల్లి ప్రవీణ్, వీరనారాయణ, సతీష్, హనుమన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపీడీవో మృతి

● వారం క్రితమే మరణించిన భార్య



శ్రీనివాసరావు (ఫైల్)

బయ్యారం, ఆగస్టు 1 : బయ్యారం ఎంపీడీవో కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఎంపీడీవో భార్య పద్మావతి కిడ్నీ సంబంధిత సమస్యతో మృతి చెందిన పది రోజుల్లో ఎంపీడీవో బెక్కంటి శ్రీనివాసరావు (59) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. భద్రాచలంలో నివాసం ఉంటున్న ఆయన 15 రోజుల క్రితం వెరికోసిల్ ఇబ్బందులతో అనారోగ్యానికి గురయ్యారు. ఈ క్రమంలో చికిత్స నిమిత్తం ఆయన్ను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆయన మృతి చెందారు. ఈ దంపతులకు ఇరువురు కూతుళ్లున్నారు. ఎంపీడీవో మృతిపట్ల మండల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా పదిరోజుల వ్యవధిలోనే ఎంపీడీవో దంపతులు అనారోగ్యంతో మృతి చెం దడం తీవ్ర విషాదం నెలకొంది.

విద్యుత్ సరఫరాలో విఫలం

● బీజేపీ యువజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి విమల్‌జైన్

గార్ల, ఆగస్టు 1 : విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ యువజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి విమల్‌జైన్ విమర్శించారు. బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ కోతలను నివారించాలని కోరుతూ గురువారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. జంపాల శ్రీను, దేవానాయక్, హరినాయక్, వీర్యానాయక్, సీతంపేట ఎంపీటీసీ నాగమణి, అజ్మీరా రాము, శివకృష్ణ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా స్కూళ్లకు హాజరుకావాలి

సీరోలు, ఆగస్టు 1 : ప్రతీరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని ఎంపీటీసీ విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను నేర్చుకొని భవిష్యత్తులో మంచి ప్రయోజకులు కావాలని సూచించారు. జూలై నెలలో వంద శాతం పాఠశాలకు హాజరైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతి రూపంలో తనవంతు సాయాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. హెచ్ఎం విత్తనాల సుధాకర్, ఉపాధ్యాయులు ఇందిరారాణి, ప్రశాంతి, విజయకుమార్, లక్ష్మీ, మాధవి, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అరుణ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

పెద్దవంగర, ఆగస్టు 1 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజపల్లి వీరన్న, సంయుక్త కార్యదర్శి చింత నవీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గద్దల వెంకన్న, భిక్షం, బీమా, మణికంఠ, రమేష్, మధు, సురేష్ పాల్గొన్నారు.

సీఎం క్షమాపణ చెప్పాలి : బీఆర్ఎస్

పెద్దవంగర, ఆగస్టు 1 : సీఎం రేవంత్‌రెడ్డి మహిళ ఎమ్మెల్యే పట్ల అసెంబ్లీలో చేసిన అనుచిత వాఖ్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, జడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్ మాట్లాడారు. బీఆర్ఎస్ మహిళ మండల అధ్యక్షురాలు బొమ్మినేని రజిత, పాలకుర్తి దేవస్థాన మాజీచైర్మన్ వి.రామచంద్రయ్యశర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీరాంసంజయ్, వెంకన్న, సమ్మయ్య, హరీష్, వెంకట్‌రెడ్డి, సీతారామ్‌నాయక్, చంద్రబోస్, మహేష్, నవీన్, భిక్షపతి, పటేల్, పూల్‌సింగ్, రవి, వెంకన్న, లక్ష్మయ్య, నివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం'



మోదీ, మందకృష్ణ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

తొర్రూరు, ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణ ఏర్పాటుపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని, తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు అలిసేరి రవిబాబు, మంగళపల్లి యాకయ్య అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ప్రధాని మోదీ, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. నాయకులు మహంకాళి బుచ్చయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, సోమారపు ఐలయ్య, పూర్ణచందర్, సురేందర్, ఉపేందర్, మహేందర్, బాలాజి, శేఖర్, అశోక్, అనిల్ ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ హర్షం

మరిపెడ, ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్ నేతలు, కార్యకర్తలు గురువారం మరిపెడ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ కూడలి వద్ద హర్షం వ్యక్తం చేస్తూ మందకృష్ణ ఫ్లెక్సీ క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చాగంటి రమేశ్ మరిపెడ విలేకరులతో మాట్లాడారు. సోమన్న, జినుక స్వామి, దూడపాక వెంకన్న, ఐనాల కృష్ణ, రవి, సీమా సురేశ్, నవీన్, రవికాంత్, వడ్లకొండ బాబు, గోల్కొండ వెంకన్న, ఎడెల్లి వెంకటేశ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

తొర్రూరు, ఆగస్టు 1 : బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్ఎస్ శ్రేణులు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి, దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆడబిడ్డలైన ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు తూర్పాటి చిన్న అంజయ్య, ప్రమోద్, శ్రీనివాస్, అంకుష్, కళావతి, పూలమ్మ, శంకర్, మొగిలి, మల్లేష్, మణిరాజ్, ఆర్.వెంకన్న పాల్గొన్నారు.

14న తొర్రూరులో బోనాలు

తొర్రూరు, ఆగస్టు 1 : తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో ఈ నెల 14న బోనాల పండుగ (ముత్యాలమ్మ తల్లికి మొక్కులు) చెల్లించుకోవాలని మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య తెలిపారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో వేదపండితుల సమక్షంలో ఈనెల 14వ తేదీన బోనాల పండుగను నిర్వహించుకోవాలని ముహూర్తం నిర్ణయించామని తెలిపారు. అన్నారం రోడ్డులో గోల్కొండ ముత్యాలమ్మ, అంబేద్కర్‌నగర్‌లో ముత్యాలమ్మ గుడివద్ద ఏర్పాట్లు పూర్తి చేస్తామని, ప్రజలు హాజరై మొక్కులు చెల్లించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు యాదగిరాచార్యులు, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, దొంగరి రేవతి శంకర్, బిజ్జాల అనిల్, రవి, జంపా, జైసింగ్, గజానంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

పెద్దవంగర, ఆగస్టు 1 : తల్లి పాలే బిడ్డకు అన్ని విధాల శ్రేయష్కరమని ఎంపీడీవో బి.వేణుమాధవ్, ఏసీడీపీ ఇందిర అన్నారు. గురువారం మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, హెచ్ఎం సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు రేణు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

●బయ్యారం : బయ్యారంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ ఆధ్వర్యంలో తల్లులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ జ్యోతి, ఎం.ఎం.భాగ్య, విజయ, లలిత, లక్ష్మి పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా అప్సర్


కొత్తగూడ, ఆగస్టు 1 : శ్రీముసలమ్మ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా అప్సర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాక్షుడిగా నక్క నరేష్, ప్రధాన కార్యదర్శిగా పల్లెర్ల గణేష్, కోశాధికారిగా అజ్మీరా రాజన్న ఎన్నికయ్యారు. అనంతరం ఆటో కార్మిక దినోత్సవం సందర్భంగా కొత్తగూడలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాకాల స్వామి, తాళ్ల రవి, అర్రెం స్వామి, తిరుపతి, కిరణ్, జితేందర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 1 : పెయిటింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలో గురువారం పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్యసమావేశాన్ని సీఐటీయూ పట్టణ కన్వీనర్ కుమ్మరికుంట్ల నాగన్న అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూనె శ్రీనివాస్, కార్యదర్శిగా నీలం సతీష్, ఉపాధ్యక్షులుగా పుచ్చకాయల అనిల్, సహాయ కార్యదర్శిగా వజ్ర కర్నాకర్, కోశాధికారిగా సిలివేరు సతీష్ ఎన్నికయ్యారు.

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాంచంద్రు



మహబూబాబాద్ టౌన్, ఆగస్టు1 : తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా మహబూబాబాద్‌కు చెందిన సంపంగి రాంచంద్రు ఎన్నికయ్యారు. మానుకోటలో గురువారం వడ్డెర సంఘం రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు గుంజె హన్మంతు, ఉపాధ్యక్షుడు గుంజె నర్సింహులు నేతృత్వంలో గురువారం సమావేశాన్ని నిర్వహించి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బత్తుల సారయ్య, ఉపాధ్యక్షుడిగా వల్లెపు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ఆలకుంట్ల శ్రీనివాస్, వెంకటేష్, కార్యదర్శిగా శివరాత్రి యాకయ్యను ఎన్నుకున్నారు. అదే విధంగా జిల్లా యువజన అధ్యక్షుడిగా పల్లపు అశోక్ నియమకయ్యారు.

జీపీ సిబ్బందికి రెయిన్‌కోట్‌ల పంపిణీ

గూడూరు, ఆగస్టు 1 : గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సిబ్బందికి గురువారం ఎంపీడీవో వీరస్వామి చేతుల మీదుగా రెయిన్‌కోట్‌లను అందజేశారు. వర్షకాలంలో తడుస్తూ విధులు నిర్వహిస్తున్న జీపీ సిబ్బందికి రెయిన్‌కోట్‌లు, డ్రస్‌కోట్‌లను అందజేసినట్లు చెప్పారు. జీపీ సిబ్బంది పనుల నిర్వహణలో ఆలసత్వం వహించకూడదని చెప్పారు. ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శి భీమానాయక్ పాల్గొన్నారు.